క్లుప్తంగా

కోర్టు భవనాల స్థలం పరిశీలన



కోర్టు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గోదావరిఖని: గోదావరిఖని చంద్రబాబు కాలనీలోని నూతనంగా నిర్మించనున్న కోర్టు భవనాల సముదాయం కోసం కేటాయించిన స్థలాన్ని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.26 కోట్ల నిధులతో ఐదు న్యాయస్థానాల భవనాలతో పాటు ఐదుగురు న్యాయమూర్తుల నివాస గృహాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శైలజ, ప్రధాన కార్యదర్శి జువ్వాజి శ్రీనివాస్, న్యాయవాదులు భూమయ్య, చెలికల పద్మజ,ఉమర్,విక్రమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

పెద్దపల్లిరూరల్: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్ తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి మండలం అప్పన్నపేట పంచాయతీలో ఆకస్మికంగా సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

సీఆర్పీ కుటుంబానికి ఆర్థికసాయం



పాసు పుస్తకం అందిస్తున్న డీటీఎఫ్ నాయకులు

రామగుండం: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ) మెండె ప్రభాకర్ కుటుంబానికి డెమోక్రటిక్ టీచర్ ఫెడరేషన్ (డీటీఎఫ్) శుక్రవారం నగదు సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బయ్యపు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ చాలీచాలని వేతనంతో సీఆర్పీగా చిత్తశుద్ధితో విధులు నిర్వహించి అనారోగ్య కారణాలతో ప్రభాకర్ బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలిపారు. మృతుడి కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. అనంతరం ఉపాధ్యాయుల జమ చేసి మొత్తం రూ.62,500/- (ఫిక్స్ డిపాజిట్ బాండ్స్) మృతుడి కుమారుడికి అందజేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కిరణ్, ప్రతాపచారి, రమేష్, ఉమామహేశ్వర్, వెంకట్రాజం తదితరులున్నారు.

'బీసీలను పట్టించుకోని ప్రభుత్వం'

రామగిరి: ప్రభుత్వం బీసీల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మోలుమూరి శ్రీనివాస్ అన్నారు. సెంటినరీకాలనీలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ బీసీలకు ఏలాంటి సబ్సిడీ పథకాలు ప్రవేశపెట్టకపోవడంతో బీసీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు చదువు మధ్యలోనే మానేసే దుస్థితి నెలకొందన్నారు. దళితబంధులాగే బీసీ బంధు పథకాన్ని ఏర్పాటు చేసి బీసీలను ఆదుకోవాలని లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో బీలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో యాట భూమేశ్, తొట్ల రాజు, తీగల శ్రీధర్, కుంట చక్రి తదితరులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



రాజేందర్‌ను సన్మానిస్తున్న నారాయణరెడ్డి

ధర్మారం: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థను స్థాపించిన మెల్విన్ జోన్ ఫెలోషిప్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ధర్మారం లయన్ ఎంజేఎఫ్ అవార్డు గ్రహీత తన్నీరు రాజేందర్‌ను జిల్లా గవర్నర్ రిక్క నారాయణరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉప గవర్నర్ అనుమండ్ల రాజిరెడ్డి, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి దుద్దిల్ల నారాయణరావు, రీజనల్ చైర్మన్ సామ ఎల్లారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబురాలు



ముర్మూర్ అంగన్ వాడీలో చిన్నారుల సంబరాలు



ధూళికట్టలో ముగ్గుల పోటీలు



బహుమతులు అందిస్తున్న సునీల్‌రెడ్డి



సుల్తానాబాద్: బహుమతులు అందిస్తున్న హాసిని

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ముందస్తు సంక్రాంతి సంబురాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంతర్గాం మండలం ముర్మూర్ మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గులు వేశారు. ఎలిగేడు మండల ధూళికట్టలో, మంథనిలో బీజేపీ నాయకుడు సునీల్ ఆధ్వర్యంలో, సుల్తానాబాద్ లో ఆర్య వైశ్య మహిళా పట్టణ అధ్యక్షురాలు రామిడి హాసిని, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు.

'కంటివెలుగు' సన్నాహక సమావేశాలు



మాట్లాడుతున్న మేయర్ అనిల్‌కుమార్



మాట్లాడుతున్న ధర్మారం ఎంపీపీ కరుణశ్రీ

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో ఈనెల 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కంటి వెలుగు సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మేయర్ మాట్లాడారు. ఈ నెల 18న తొలత 3వ, 9వ,10వ, 14వ, 19వ, 20వ, 42వ డివిజన్లలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా డివిజన్లలో కంటివెలుగు శిబిరం నిర్వహించే కేంద్రాలను గుర్తించినట్లు మేయర్ తెలిపారు. ఈ శిబిరాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమిషనర్ బి.సుమన్‌రావు మాట్లాడుతూ... కంటి వెలుగు కేంద్రానికి వచ్చే వారు తమ వెంట ఆధార్ కార్డు తెచ్చుకునేలా అవగాహన కల్పించాలని మెప్మా ఆర్పీలకు సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు, అధికారులు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆర్పీలు, ఏఎన్ఎంలు, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరరులు పాల్గొన్నారు.

రామగుండం: ఈనెల 18 నుంచి చేపడుతున్న కంటి వెలుగును విజయవంతం చేయాలని అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ కోరారు.శుక్రవారం ముర్మూర్‌లో కంటి వెలుగుపై సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కంటి వెలుగు విజయవంతానికి అంగన్‌వాడీలు, గ్రామ స్థాయి ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. సర్పంచ్ బాధరవేణి స్వామి, ఎంపీడీవో భూక్య యాదగిరి, జీపీ సిబ్బంది హాజరయ్యారు.

సుల్తానాబాద్: కంటివెలుగు కార్యక్రమాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ మధుకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమాన్నివిజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు అధికారులుసమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్ ప ర్సన్ ముత్యం సునీత గౌడ్ అన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ శ్రీనివాస్ రెడ్డి, డా. శ్రీజ, స్పెషల్ ఆఫీసర్ భాస్కరాచారి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: కంటి వెలుగును సద్వినియోగం చేసుకునేలా అందరికీ అవగాహన కల్పించాలని డాక్టర్ మధుకర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహిచారు.

జూలపల్లి: కంటి వెలుగును విజయవంతం చేయాలని ఎంపీడీవో వేణుగోపాలరావు సూచించారు. జూలపల్లి, కుమ్మరికుంట గ్రామాల్లో కంటి వెలుగు నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు నర్సింహయాదవ్,సంతోష్‌రావు, అంగన్‌వాడీ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్తారం: కంటివెలుగు కార్యక్రమంను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఓడేడ్‌లో పాలకవర్గం సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ సిరికొండ బక్కారావు, ఎంపీడీవో కలికోట శ్రీనివాస్, ఎంపీవో బైరి వేణు మాధవ్ తదితరులు ఉన్నారు.

కమాన్‌పూర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి రవూఫ్‌ఖాన్,ఎంపీపీ రాసకొండ లక్ష్మి, ఎంపీడీవో విజయ్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు.

ధర్మారం: కంటివెలుగును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం కంటివెలుగుపై సమావేశాన్ని నిర్వహించారు. కంటి వెలుగు విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుండీల్లో మొక్కలు

సాక్షి స్పందన



కుండీల్లో మొక్కలు నాటిన సిబ్బంది

రామగుండం: రామగుండం రైల్వే స్టేషన్ మార్గంలో వంతెనపై ఉన్న కుండీల్లో బల్దియా సిబ్బంది ఎర్ర మట్టి పోసి మొక్కలను నాటుతున్నారు. ఈనెల 3న 'ర్యాంకు సరే... పచ్చదనంపై పట్టింపేదీ..?' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. కాగా వంతెనపై ఉన్న కుండీల్లో మొక్కలు నాటడం లేదు. ఇప్పటివరకు సుమారు 30 కుండీల్లో పూల మొక్కలు నాటారు. మిగతా కుండీల పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మొత్తం పూలకుండీల్లో మొక్కలు నాటాలని కోరుతున్నారు.

సమాచారం

నేడు గోదాదేవి కల్యాణం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం 11 గంటలకు గోదారంగనాయక కళ్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు శ్రీరంగం నర్సింహాచార్యులు తెలిపారు.

జూలపల్లిలో..

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా నేడు గోదారంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు రంగనాథాచార్యులు తెలిపారు. కల్యాణానికి ధర్మకర్తలు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని బస్టాండ్‌కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నేడు ఉదయం 11 గంటలకు శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణం అనంతరం అన్నదానం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు కాపులపల్లిలో ముగ్గులపోటీలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కాపులపల్లిలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గోపు కవిత తెలిపారు.

17న మండల సర్వసభ్య సమావేశం

రామగిరి: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 17న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఆరెల్లి దేవక్క తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

20న పెద్దపల్లి మండల పరిషత్..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 20న ఎంపీపీ బండారి ప్రవంతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజు తెలిపారు.

22న రత్నాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

రామగిరి: మండలంలోని రత్నాపూర్‌లో ఈ నెల 22న సింగరేణి సంస్థ ఆర్జీ–3 ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్వోటూ జీఎం రఘుపతి తెలిపారు. శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించే ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆయన వెంట సర్పంచ్ పల్లె ప్రతిమ, డీజీఎం పర్సనల్ విలాస్ శ్రీనివాస్ పొద్దార్, ఎన్విరాల్‌మెంట్ అధికారి ఎంఏ షఫీ, వైద్యాధికారి పద్మ ఉన్నారు.

రైతులకు అందుబాటులో కాంప్లెక్స్ ఎరువులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి కాంప్లెక్స్‌తో పాటు యూరియా అందుబాటులో ఉన్నట్లు సింగల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ సీఈవో సంతోష్ కుమార్ తెలిపారు. వరి నాట్లు అధికంగా వేస్తుండడంతో అడుగుమందుకు రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు స్టాక్ ను తెప్పించినట్లు పేర్కొన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేసీఆర్ సేవాదళ్ పట్టణ అధ్యక్షుడిగా షకీల్



నియామక పత్రం అందిస్తున్న వెంకటేశ్వర్లు

పెద్దపల్లిరూరల్: కేసీఆర్ సేవాదళ్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా షేక్ షకీల్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకటేశ్వర్లు, కాంతయ్య శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళతున్నట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని షకీల్ తెలిపారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం చేయొద్దు

పెద్దపల్లిరూరల్: రైతులు ట్రాక్టర్లకు కేజీవీల్స్ అమర్చి రోడ్లపై నడిపి రోడ్లను పాడు చేయవద్దని ఆర్ అండ్‌బీ ఈఈ నర్సింహాచారి కోరారు. ప్రజల సౌకర్యం కోసం కోట్లాది రూపాయలను వెచ్చించి రోడ్లను నిర్మిస్తే కేజీవీల్స్ ట్రాక్టర్లను నడిపి ధ్వంసం చేయడం సరికాదన్నారు. కేజీవీల్స్ కు పట్టీలను అమర్చుకున్న తర్వాత నడిపితే రోడ్లు ధ్వంసం కావన్నారు. కేజీవీల్స్‌కు పట్టీలను అమర్చకుండా నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రుద్రాభిషేకం



శివాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

సుల్తానాబాద్: పట్టణంలోని పురాతన శివాలయంలో శుక్రవారం శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి రుద్రాభిషేకం, అన్న పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు పూజారి మహేష్, రమేశ్‌లు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, దంపతులు బొడ్ల శ్రీనివాస్ సుజాత పల్ల భగవాన్, అల్లంకి ఆనందం, కొమురవెల్లి భద్రయ్య, నార్ల వెంకన్న, వాసాల శ్రీనివాస్, కైలాసం ఉన్నారు.

వేబ్రిడ్జికి నోటీసులు



నోటీసులు అందిస్తున్న సిబ్బంది

ముత్తారం:మండలంలోని ఖమ్మంపల్లిలో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న వేబ్రిడ్జి కాంటాకు నోటీసులు జారీ చేసినట్లు సర్పంచ్ సముద్రాల రమేశ్ తెలిపారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన వేబ్రిడ్జి కాంటాకు పాలకవర్గం ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశామని, సంబంధిత అధికారులు స్పందించి కాంటాను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేశ్, పాలకవర్గం పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థుల విహారయాత్ర



విహారయాత్రలో విద్యార్థుల బృందం

రామగుండం: అంతర్గాం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలింసిటీ విహారయాత్రకు తరలివెళ్లారు. మరో రెండు మాసాల్లో పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు చిరస్థాయిగా గుర్తుండిపోయే విధంగా విహారయాత్రకు తీసుకువెళ్లిన్నట్లు హెచ్ఎం ఇరుగురాల ఓదెలు తెలిపారు. ఈ యాత్రకు ప్రత్యేక బస్సులో రెండు తరగతులకు చెందిన 84 మంది విద్యార్థులు, ఏడుగురు ఉపాధ్యాయులు వెళ్లారు.

కోదండ రామాలయంలో గోదారంగనాథుల కల్యాణం



గోదావరిఖనిటౌన్: పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ గోదా రంగనాథ స్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు గోవర్ధనగిరి మధుసూధనాచార్యులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు.

అంజయ్య మృతి పార్టీకి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దాసరి, నాయకులు

సుల్తానాబాద్: బీఆర్ఎస్ నాయకులు బండ అంజయ్య మృతి పార్టీకి తీరని లోటని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రి నగర్ కి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త బండ అంజయ్య దినకర్మకు హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్ రావు, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక , కౌన్సిలర్లు రేవెళ్లి తిరుపతి, గుర్రాల శ్రీనివాస్, కూకట్ల గోపి,నాయకులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు ఎమ్మెల్యేకు వినతి

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో ఎస్సీ కమ్యూనిటీ భవనం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతిబసు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

పోస్టాఫీస్ సేవింగ్స్ లాభదాయకం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ నారాయణ

రామగుండం: కేంద్ర ప్రభుత్వరంగ పోస్టాఫీసులో ప్రతీ ఒక్కరూ ఖాతా తెరిచి పొదుపు లావాదేవీలు నిర్వహించుకోవడం లాభదాయకమని అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట పోస్టాఫీసులో వివిధ రకాల డిపాజిట్లపై పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల్లో ప్రకటించే పథకాలను పోస్టల్‌లో కూడా ప్రవేశపెడుతున్నారని, రూ.399/-లకే ప్రమాదబీమా పాలసీ ప్రవేశపెట్టిందన్నారు. పోస్టాఫీస్ జీవిత బీమా పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీపీఎం ఎం.పోచయ్య, రవితేజ, మాడిశెట్టి శ్రీకాంత్, ఆముల పర్శురాం, ఆనంద్ తదితరులున్నారు.

జూలపల్లి: పోస్టాఫీసుల్లో అమలు చేస్తున్న జీవిత బీమా, నగదు జమ, తీసుకోవడం, తదితర సేవలపై స్థానికులకు అవగాహన కల్పించారు. పోస్టల్‌లో ఉండే వివిధ బీమాల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది న్యాతరి మల్లేశం, ఉమారాణి,సంధ్య పాల్గొన్నారు.

బహుజనులపై ప్రభుత్వానిది కపట ప్రేమ



మాట్లాడుతున్న దాసరి హన్మయ్య

జూలపల్లి: తెలంగాణలో బహుజనులపై ప్రభుత్వ పెద్దలు కపట ప్రేమ చూపిస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హన్మయ్య ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి మాట్లాడారు. తెలంగాణ సీఎస్‌గా 1988 బ్యాచ్ అధికారి ఉండగా 1989 బ్యాచ్‌కు చెందిన అధికారిని నియమించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో బహుజనులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 75 ఏళ్లుగా బహుజనులకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్ ట్యాప్ చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరికిల్ల రాజనర్సయ్య, ఆర్గనైజర్ రాజనర్సయ్య, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అధికారులకు కాంగ్రెస్ నాయకుల సన్మానం

ముత్తారం: మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ వరందన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు అమరేందర్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎంపీటీసీ దొడ్డ గీతారాణి, నాయకులు విష్ణు గౌడ్, జితేందర్ యాదవ్, ప్రభాకర్, విజయ్ తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ గ్రామానికి చెందిన తిరుపతిగౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, మంజూరైన రూ.35 వేల చెక్కును శుక్రవారం బాధితుడికి సర్పంచ్ మాంకాళి తిరుపతి అందజేశారు.కార్యక్రమంలో కాచాపూర్ సర్పంచ్ బంటు ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి గంగులను పరామర్శించిన నాయకులు

మంథని: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తండ్రి ఇటీవల మరణించగా ఆయనను శుక్రవారం మంథని టీఆర్ఎస్ నాయకులు కల్సి పరామర్శించారు. కాపు సంఘం మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎంపీపీ కొండ శంకర్, నాయకులు తగరం శంకర్ లాల్, తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలో శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సర్పంచ్ పెర్క రిషిత, కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండె వెంకటేశ్వర్లు, శాతల్ల కాంతయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సతీశ్, నిఖిల్, దీపిక, శామిలి, హారిక, గౌతమి, సాత్విక, మానస, సుకన్య, నవ్యశ్రీ, భారతి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: జిల్లా విశ్వబ్రాహ్మణ అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ వారు ముద్రించిన క్యాలెండర్‌ను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. వోపా నాయకులు రాజేంద్రప్రసాద్, కాసర్ల శ్రీనివాస్, కట్ట నరేంద్రచారి, వేణుగోపాలచారి, తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం: మండలంలోని ఇప్పలపల్లి (రామక్రిష్టాపూర్) గ్రామంలో కేసీఆర్ సేవాదల్ మండల అధ్యక్షుడు ఎడ్ల సంతోష్ శుక్రవారం క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పు శ్రీనివాస్, నగేశ్ తదితరులు ఉన్నారు.

ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన

గోదావరిఖని: గోదావరిఖని సప్తగిరి కాలనీలో ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో వరద ముంపు, గ్యాస్ లీకేజీ పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాల్వ స్వరూప, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్,ఆర్ఐ భవానిప్రసాద్, ఎన్డీఆర్ఎఫ్ కమాండర్ బిటన్‌సింగ్, ఎస్సై వైవి రెడ్డి, ఏఎస్సై యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

గోదావరిఖని: ఫిబ్రవరి 26, 27 తేదీల్లో గోదావరిఖనిలో జరగనున్న సీఐటీయూ 16వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం జరుగుతుందని, భవిష్యత్ పోరాటాల రూపకల్పన కోసం మహా సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు సమావేశంలో అధ్యక్షుడిగా సారయ్య, ప్రధాన కార్యదర్శిగా మెండె శ్రీనివాస్, కోశాదికారిగా ఆసరి మహేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, జిల్లా కార్యదర్శి ముత్యంరావు,రాష్ట్ర జనరల్ సెక్రటరీ నాగరాజు, గోపాల్ మంద నర్సింహారావుపాల్గొన్నారు.